క్లుప్తంగా

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన

నల్లజర్ల: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్రను తెలియజేస్తూ డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ నల్లజర్ల పోలీసులు ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు.కే.అరవిందకుమార్ అధ్యక్షతన ఈ సదస్సులో నల్లజర్ల సీఐ లక్ష్మణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడంలో ప్రతి విద్యార్థి తనదైన పాత్ర పోషించాలని ఆయన కోరారు. ఎస్సై నరసింహమూర్తి, కళాశాల సెక్రటరీ ఆకుల త్రిమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల వివరాలు ఈ- కర్షక్‌లో నమోదు



కొత్తపల్లి అగ్రహారంలో రైతులకు ఈ కర్షక్‌పై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పెరవలి: రైతులు సాగు చేసే పంటల వివరాలను గ్రామ సచివాలయాల్లో తెలియజేసి ఈ కర్షక్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి మేరీ కిరణ్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి అగ్రహారం, కాపవరం, కానూరు గ్రామాల్లో బుధవారం ఈ కర్షక్ కార్యక్రమం నిర్వహించి పంటలను నమోదు చేసారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కర్షక్‌లో పంట నమోదైతేనే ప్రభుత్వ పథకాలు రైతులకు నేరుగా అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక



రామబ్రహ్మంకు పార్టీ కండువా కప్పిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: దేవరపల్లి మండలం పల్లంట్లకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు మతుకుమిల్లి సీతా రామబ్రహ్మం వైఎ స్సార్ సీపీలో చేరారు. సోమవారం విశాఖపట్నంలో సీతారామబ్రహ్మంకు టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. బుధవారం పల్లంట్లలో సీతా రామబ్రహ్మం మాట్లాడుతూ రెండేళ్లుగా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాలో స్వచ్ఛందంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, విశాఖ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ), ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరినట్టు ఆయన తెలిపారు.

మైనర్లను వేధిస్తే కఠిన చర్యలు

ఉండ్రాజవరం: ప్రేమ పేరుతో మైనర్లను వేధిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని ఉండ్రాజవరం ఎస్సై కె.రామారావు హెచ్చరించారు. మండలంలో తాడిపర్రు ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై, పోక్సో చట్టంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం కోటిపల్లి సరోజిని, కోట రాంప్రసాద్, పీఈటీ కె.గంగాధర్‌రావు, విద్యా కమిటీ మెంబర్ గరిమెళ్ళ తాతారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా సొమ్ము చెల్లించాలి

నల్లజర్ల: నిత్యావసర సరుకులు సరఫరాచేసే ఆపరేటర్ల వాహనాలకు ఈఏడాది బీమా రూ.10వేల నుంచి రూ.19వేలు పెరిగింది. ఈ పెరిగిన మొత్తాన్ని పౌరసరఫరాలశాఖ భరిస్తుందని గతంలో వాగ్దానం చేసారని దానిని ఇప్పుడు అమలు చేయాలని ఎండీయూ ఆపరేటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. వీరంతా బుధవారం నల్లజర్ల తహసీల్దారు మక్బూల్ ఆలీకి ఈ అంశంపై వినతిపత్రం సమర్పించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కొవ్వూరు: కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రకు కొనసాగింపుగా రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 26 నుంచి మార్చి 26వ తేదీ వరకు హాత్ సే హాత్ జోడో అభియాన్ పేరుతో చేపట్టే కార్యక్రమం విజయవంతం చేయాలని మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లాబేగ్ ప్రకటించారు. కొవ్వూరు మండలం కాపవరంలో ఎండీ రఫీ యుల్లాబేగ్ స్వగృహం వద్ద హాత్ సే హాత్ జోడో అభియాన్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు సాకే పుల్లారావు, చాగల్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మట్టా సుబ్బారావు, జిల్లా కార్యదర్శి జొన్నకూటి రవికుమార్, రాజమహేంద్రవరం ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి భాస్కర్ పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

తాళ్లపూడి: అన్నదేవరపేటకు చెందిన అయినపర్తి జాన్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురవడంతో ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సంస్థ బుధవారం ఆర్థిక సాయం అందజేసారు. మానవత అధ్యక్షుడు జె వెంకటేశ్వరరావు, సభ్యుల చేతులు మీదుగా రూ.5 వేలు అందజేసారు. సంస్థ రీజనల్ చైర్మన్ చంద్రయ్య, మండల కార్యదర్శి సాయన సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణం

దేవరపల్లి: దేవరపల్లిలో షిర్డీసాయినాథుని వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా సాయినాథుడిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం 9 గంటలకు మహావిష్ణుహోమం, 10 గంటలకు లక్ష్మీనారాయణ శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన పురోహితులు ఘంటసాల ఫణికుమార్ శర్మ స్వామి కల్యాణాన్ని శాస్త్రోత్తంగా నిర్వహించారు. అమ్మవారిని పెళ్లి కుమార్తెగా, స్వామి వారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి వేద మంత్రాలతో కల్యాణం జరిపించారు. ఈ కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించారు. అనంతరం మందిరం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

మునిపల్లి శ్రీలక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లి శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సహస్రనామార్చన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించారు.

గోపాలస్వామి పల్లకిలో ఊరేగింపు

ఉండ్రాజవరం: భీష్మ ఏకాదశి సందర్భంగా తాడిపర్రు, మోర్త, వేలివెన్నులో గోపాలస్వామి, ఉండ్రాజవరంలో కేశవస్వామి ఆలయాల్లో స్వామి వార్లకు బుధవారం భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామివార్లను పల్లకిలో గ్రామంలో ఊరేగించారు.

వేలివెన్నులో వీరభద్ర స్వామి ఉరేగింపు

వేలివెన్నులో శ్రీవీరభద్ర స్వామి ప్రభల ఉరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో



వేలివెన్నులో వీరభద్ర స్వామి ప్రభల ఉరేగింపు

ప్రభలతో పాటు డప్పులు,వాయిద్యాల నడుమ యువకులు బుగ్గలలో కత్తులు, శూలాలు దింపుకుని ప్రభల ముందు నృత్యాలు చేస్తూ ఊరేగారు. అనంతరం ప్రసాద వితరణ చేసారు. మంగళవారం రాత్రి స్వామి వారి కళ్యాణం కనుల పండుగగా జరిగింది. కరికాల బత్తుల సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈకళ్యాణ మహోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా పార్వతీ సమేత ధర్మేశ్వర స్వామి కల్యాణం

మండలంలో దమ్మెన్నులో వేంచేసియున్న పార్వతీ సమేత ధర్మేశ్వరస్వామి దివ్య కల్యాణం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కాల్దారీ వెంకటసూర్య సత్యనారాయణ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాల మధ్య ధర్మేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణోత్సవం ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్రంశెట్టి వెంకటేశ్వరరావు, సభ్యులు, ఈఓ ఎస్.శివ పరివేక్షించారు. ఈకల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో చండీహోమం



దేవరపల్లిలో లక్ష్మీనారాయణ కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కొవ్వూరు: పట్టణంలో గోష్పాదక్షేత్రంలోని ఆత్మీయ హితకారిణి సమాజంలో జ్ఞాన సరస్వతి ఆలయంలో బుధవారం లోక కల్యాణార్థం చండీయాగం నిర్వహించారు. ఎస్ఎస్ వాజ్‌పేయ్, కస్తూరి కాంతారావు దంపతులు చేతుల మీదుగా పురోహితులు కొండూరి మణికిరణ్ శర్మ, సతీష్ శర్మలు హోమం నిర్వహించారు. పాలకోడేటి సత్యనారాయణ మూర్తి, రాఘవేంద్రరావు, నాదెళ్ల రామం, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకాలు

పెరవలి: నల్లాకులవారిపాలెంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఏకాహ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం భీష్మ ఏకాదశి కావటంతో వేలాది మంది భక్తులు తరలిరావటంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. దూరప్రాంతం నుంచి వచ్చిన భక్తులకు భోజన వసతి, చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేశారు. స్వామి వారికి గంధసిందూరం పూజ, తమలపాకులతో పూజలు చేసారు. బుధవారం 312 మంది భక్తుల తులాభారం ద్వారా 2 టన్నులు పటిక బెల్లం ఆలయానికి వచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం



కొవ్వూరు 23వ వార్డులో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- 23వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

కొవ్వూరు: సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఎటువంటి వివక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో 23వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వాటర్ ట్యాంకు జంక్షన్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గడిచిన మూడున్నర ఏళ్ల కాలంలో ఆయా కుటుంబానికి ఎంత మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారం పంపిణీ తీరుని అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల శిబిరంలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్రోతు అంజనీదేవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, నగ్గలపాటి శ్రీనివాస్, చిట్టూరి అన్నవరం, కొయ్యల భాస్కరరావు, అడ్డగర్ల వీరాస్వామి, అడ్డూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, యాళ్ల నరసింహారావు, దేవగుప్తాపు లక్ష్మణరావు, వరిగేటి సుధాకర్, వార్డు కౌన్సిలర్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు క్రికెట్ కిట్ అందజేత

కొవ్వూరు: పట్టణంలో సచివాలయ ఉద్యోగులకు వచ్చే నెలలో నిర్వహించే క్రీడాపోటీలను దృష్టిలో ఉంచుకుని పట్టణానికి చెందిన 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర ఆర్థిక సాయంతో సమకూర్చిన క్రికెట్ కిట్‌లను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా పంపిణీ చేశారు. బుధవారం 23వ వార్డులో పార్టీ నాయకులు చిట్టూరి అన్నవరం స్వగృహం వద్ద క్రికెట్ కిట్‌ను మంత్రి సచివాలయ ఉద్యోగులకు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్రోతు అంజనీదేవి, పట్టణ గౌరవ అధ్యక్షుడు నగ్గలపాటి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొవ్వూరు: కుమారదేవంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. రుత్వికులు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి ప్రతిష్ఠ చేశారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల గౌరవ అధ్యక్షుడు గన్నమని వెంకటరాజు, కుమారదేవం ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్, గండి పోశమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు గంధం శ్రీనివాస్, సీనియర్ నాయకులు కోడూరి సత్యనారాయణ(సత్తులు) సర్పంచ్ కాసాని దుర్గ తదతరులు పాల్గొన్నారు.



కుమారదేవంలో ఆలయం ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న హోం మంత్రి తానేటి వనిత

5న ఏపీ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ జేఏసీ మహాసభ

కొవ్వూరు: ఏపీ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ మూడో రాష్ట్ర మహాసభలను ఈనెల 5న కర్నూలులో నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర కోశాధికారి పెదపాటి గురునాథం బుధవారం తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు జేఏసీ కృషి చేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు, పట్టణ విభాగం అధ్యక్షుడు అప్పారావు మహాసభ విజయవంతం చేయాలని కోరారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

కొవ్వూరు: తాళ్లపూడి మండలం తుపాకులగూడెం గ్రామానికి చెందిన జుత్తిక పవన్‌కుమార్ నాటు సారా తయారీ కేసులో బుధవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. నాటుసారా తయారీకి వినియోగించే 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. నిందుతుడ్ని కొవ్వూరు కోర్టులో హాజరు పరిచామన్నారు.

నేడు 14వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

కొవ్వూరు: పట్టణంలో 14వ వార్డులో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు తెలిపారు. గురువారం ఉదయం 8గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పట్టణంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నేడు కోడిగూడెంలో

దేవరపల్లి: ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంలో గురువారం ఉదయం 9 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు ప్రతాపనేని వాసు తెలిపారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు హాజరుకావాలని ఆయన తెలిపారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

దేవరపల్లి: పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సీపీఎస్ ప్రాంతీయ సదస్సులో ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. బుధవారం దేవరపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద సీపీఎస్ మూడు మండలాల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. సదస్సులో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. షరీఫ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ఉస్సే శంకరుడు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉపాధ్యాయులను ఆదుకోవాలన్నారు. ఈ సదస్సులో జిల్లా కార్యదర్శులు ఎం. మహాలక్ష్మి, ఎస్.వి.వి. తాతారావు, సీహెచ్ మనోహర్ కుమార్, దేవరపల్లి మండల శాఖ ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, నల్లజర్ల మండల ప్రధాన కార్యదర్శి బి.కిషోర్, అధ్యక్షుడు ప్రక్రుద్దీన్ ఆలీ, గోపాలపురం మండల అధ్యక్షుడు బి.రవి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- త్యాజంపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

దేవరపల్లి: రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. దేవరపల్లి మండలం త్యాజంపూడిలో రెండో రోజు బుధవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మూడేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను ఎమ్మెల్యే తలారి లబ్ధిదారులకు వివరించారు. సంక్షేమ పథకాలు, పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా? అని మహిళలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించి బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. దళితవాడలోని కమ్యూనిటీ భవనం వద్ద



త్యాజంపూడిలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాలతో సమావేశం నిర్వహించి వైఎస్సార్ ఆసరా పథకం ఆవశ్యకతను వివరించారు. రాబోవు ఎన్నికల్లో మీరంతా మరొకసారి సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, వైఎస్. రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, ఉపసర్పంచ్ కుసులూరి వెంకట సతీష్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు పల్లి రాంబాబు, మాజీ సర్పంచ్ పల్లి వెంకటరత్నారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గడా జగదీష్, నియోకవర్గ మహిళా కన్వీనర్ ఆచంట అనసూయ, ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరశర్మ, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో చాగల్లు విద్యార్థినికి తృతీయ స్థానం



చాగల్లులో విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగల్లు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చక్కటి ప్రతిభ కనబరిచిందని హెచ్ఎం పి.వీర్రాజు తెలిపారు. జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు ప్రకాశం జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని జహ్నవి దేవి తృతీయ స్థానం సాధించిందని తెలిపారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిని వ్యాయమ ఉపాధ్యాయులు జె.విజయలక్ష్మి, ముని, ప్రేమ్‌చంద్ అభినందించారు.

ఆన్‌లైన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలి

నిడదవోలు: యువత ఆన్‌లైన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్సై పి.నాగరాజు సూచించారు. నిడదవోలు ఎస్ఎఫ్ఎస్ జూనియర్ కళాశాలలో ఆన్‌లైన్ యాప్స్ వినియోగం, రోడ్డు భద్రత, డ్రగ్స్, మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగంలో యువత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ కె.విజ య్‌శేఖర్, అధ్యాపకులు ఎస్.సుజాత, ఇ.అప్పా రావు, డి.వీర్రాజు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు

తాళ్లపూడి: మండలంలో పలు ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశామని ఎంఈవో కె వివేకానంద తెలిపారు. ఒకే ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలలు 8 మిగిలాయని తెలిపారు. వీటిలో రాగోలపల్లి, పోచవరం, గజ్జరం, సూరయ్యపేట, మలకపల్లి(2), తిరుగుడుమెట్ట, బల్లిపాడు ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది విద్యార్థులున్నారని తెలిపారు. దీంతో ఈ పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారని అన్నారు.

ఉత్తమ రీజియన్ చైర్‌పర్సన్‌గా చినబాబు ఎంపిక

కొవ్వూరు: లయన్స్ క్లబ్ 2021-22 సంవత్సరానికి జిల్లా ఉత్తమ రీజియన్ చైర్‌పర్సన్‌గా పట్టణానికి చెందిన పాలెంపాటి చినబాబు చౌదరి ఎంపికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో నిర్వహించిన కార్యక్రమంలో ఘట్టమనేని బాబురావు చేతుల మీదుగా ఆయన బుధవారం అవార్డు అందుకున్నారు.అంబటి సుధాకర్‌రెడ్డి, పర్వతనేని జగదీష్ బాబు,డి.రంగారావు, రీజియన్ పరిధిలో అప్పటి పట్టణ క్లబ్ అధ్యక్షుడు మన్యం వీరభద్రరావు(బుల్లిబాబు), చాగల్లు మండలం నెలటూరు, తాళ్లపూడి, దేవరపల్లి, తిమ్మరాజు పాలెం, వేలివెన్ను, సమిశ్రగూడెం, నిడదవోలు క్లబ్‌ల అధ్యక్షుడు మేడా వీరవెంకట వరప్రసాద్, దుగ్గిరాల సూర్యప్రకాశరావు, పరిమి రాంబాబు, వల్లభని రాంబాబు, ఇమ్మణ్ణి వెంకట అప్పారావు, కొమ్మన వెంకటేశ్వరరావు అవార్డులు అందుకున్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏ.శ్రీనివాసు బుధవారం తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

దుష్ప్రచారం చేస్తున్నారని డీఎస్పీకి ఫిర్యాదు

కొవ్వూరు: మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఫొటోతో సోషల్ మీడియాలో ఐటీడీపీ అనే ఫేక్ అకౌంట్‌తో శ్రద్ధాంజలి అంటూ తప్పుడు పోస్టింగ్‌లు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మకు బుధవారం ఫిర్యాదు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్లు బూరుగుపల్లి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

తాడిమళ్లలో కంటి వైద్యశిబిరం

నిడదవోలు రూరల్: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పేదలకు ఆర్థిక భారం లేకుండా వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తాడిమళ్ల సచివాలయంలో కంటి వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి ఎంపీపీ భాగ్యలక్ష్మి చేతులు మీదుగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సుధీర్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



తాడిమళ్లలో వృద్ధులకు కళ్లజోళ్లు అందజేస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

పింఛన్ల పంపిణీ పరిశీలన

తాళ్లపూడి: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇంటి పెద్ద కొడుకులా ప్రతి ఇంటికీ ఒకటో తేదీన తెల్లవారక ముందే వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిస్తున్నారని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. తాళ్లపూడి మండలంలోని 15 సచివాలయాల పరిధిలో బుధవారం వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో పింఛన్ సొమ్ములు అందజేసారు. మొత్తం 7,641 పింఛన్లకు 6,294 మందికి పింఛన్ల పంపిణీ పూర్తి చేసారు. మండలంలో ప్రక్కిలంక, పెద్దేవం, మలకపల్లి తదితర గ్రామాల్లో పింఛన్ సొమ్ముల పంపిణీ చేస్తున్న తీరును ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు పరిశీలించారు

హక్కుల సాధన కోసం ఐక్య పోరాటం

నిడదవోలు రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి పిలుపునిచ్చారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా మహాసభలను నిడదవోలు బీసీ సామాజిక భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హైకోర్టు న్యాయవాది, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. ముందుగా అరుణోదయ కళాకారుల బృందం సభ్యులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి కార్మిక వర్గ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సువర్ణరాజు, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.



నిడదవోలులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు

ఐఎఫ్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఐఎఫ్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కేవీ రమణ, ప్రధాన కార్యదర్శిగా బద్దా వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా కాకర్ల అప్పారావు, పి.నాగేశ్వరరావు, ఎస్.రామ్మోహన్‌ను ఎన్నుకున్నారు.

గ్రామాలకు మత్స్య సంపద ఉత్పత్తులు

దేవరపల్లి: గ్రామగ్రామానికి మత్స్య సంపద ఉత్పత్తులను సరఫరా చేయడానికి ప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో నిరుద్యోగులకు మొబైల్ వాహనాలను అందజేస్తుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. దేవరపల్లి మండలం త్యాజంపూడిలో లబ్ధిదారుడు ఉప్పుల సుందరరావుకు మంజూరైన మొబైల్ వాహనాన్ని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించి లబ్ధిదారుడికి అందజేశారు. వాహనం వద్ద వినియోగదారులకు ఎమ్మెల్యే వెంకట్రావు చేపలను విక్రయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో 60 శాతం రాయితీపై ఎస్సీ నిరుద్యోగులకు మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటి మొబైల్ వాహనాన్ని త్యాజంపూడికి అందజేసినట్టు ఆయన చెప్పారు. వాహనం ఖరీదు రూ.3 లక్షలు కాగా, దీనిలో రూ.1.80 లక్షలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. రూ.1.20 లక్షలు లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పెరవలిలో ఏర్పాటు చేస్తున్న హబ్ నుంచి మత్స్య సంపదను నేరుగా గ్రామాల్లోని ఫిష్ ఆంధ్రా రిటైల్ దుకాణాలకు సరఫరా చేస్తారని ఆయన తెలిపారు. దీని వల్ల రైతులకు సాగు చేసిన మత్స్య సంపద ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వస్తుందన్నారు. సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, ఉపసర్పంచ్ కుసులూరి వెంకటసతీష్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, మాజీ సర్పంచ్ పల్లి వెంకటరత్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పల్లి రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గడా జగదీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతుల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సొసైటీ మాజీ అధ్యక్షులు గంజి రాజారావు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ శాంతి, గౌరీపట్నం సొసైటీ అధ్యక్షుడు గుత్తికొండ అచ్యుతరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కడిమి రాజు, పార్టీ నాయకులు మాదవరపు వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



త్యాజంపూడిలో ఫిష్ ఆంధ్ర మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com